

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# అన్నం ముద్ద భారం కాబోతుందా?

**సామాన్యులకు ఎల్ నినో ప్రభావం**

**నెల ఆదాయం పది రోజుల్లోనే ఆవిరయ్యే ప్రమాదం**

**ప్రభుత్వం అవగాహన పెంచాల్సిన అవసరం**

**నాగర్‌కర్నూల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావం సరిగా లేని కారణంగా రైతులు వరి పంటను పెద్దగా సాగు చేయడం లేదు. ప్రభుత్వం కూడా అదే మంచి దని ప్రచారం చేపట్టింది. దీన్ని ప్రభావం పేద మధ్యతరగతి ప్రజలకు పడబోతుందని పలువురు భావిస్తున్నారు. దీని అదునుగా భావించి కొందరు బియ్యం వ్యాపారస్తులు అధిక మొత్తంలో స్టాక్ ను నిలువ చేసుకొని ఎల్ నినో ప్రభావం మరింత ఉధృతం అయిన తర్వాత బియ్యం అమ్ముకొని లాభం పొందుదామని ఆలోచన చేస్తున్నారని తెలుస్తుంది. సంబంధిత అధికారులు తక్షణమే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఇది కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



బియ్యం బస్తాలు (ఫైల్)

# మన సంస్కృతిని ప్రతిబింబించేదే అలయ్ బలయ్

**ప్రజలంతా సోదరభావంతో**

**మెలుగుతూ నగర ప్రతిష్టను పెంచాలి**

**ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**అయ్యప్ప నియమాలతో ఆధ్యాత్మికత ఆదర్శనీయం**

**మహబూబ్‌నగర్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** అలయ్ బలయ్ వంటి కార్యక్రమాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ ప్రజల మధ్య ఐక్యత, సోదర భావాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచర సమితి ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రజలందరూ కలిసికట్టుగా, పరస్పర గౌరవంతో మెలుగుతూ మహబూబ్‌నగర్ ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప దీక్షా చేపట్టి మండల కాలం పాటు భగవంతున్ని ఆరాధిస్తూ సర్వేజనా సుఖినోభవంతు అని నిరంతరం అయ్యప్ప స్వామి శరణ ఘోషతో అందరినీ ఆధ్యాత్మికత వైపు నడిపించే అయ్యప్ప స్వాములు, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచర సమితి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఒకచోట చేరి పండుగలు, సంప్రదాయాలను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలోని గొప్పతనాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ నగర అభివృద్ధికి, ప్రతిష్ట పెంపునకు తమ వంతు సహకారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించిన అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి, పాలమూరు శాఖ ప్రతినిధులను – మిగతా4లో..



మాట్లాడుతున్న విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



అలై బలైలో నేతలు

# మోడీ సర్కారు, ఈసీపై సమరశంఖం..

**ప్రజల్లోకి బీజేపీ వైఫల్యాలు!**

**నవంబర్ 1న ఢిల్లీలో మహాధర్నాకు**

**కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి పిలుపు**

**కరువుపై బీఆర్ఎస్ నేతల తీరును**

**ఎండగట్టాలి : ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 25, ప్రభాతవార్త:** కేంద్రంలోని బీజేపీప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీ నడిబొడ్డున నిర్వహించనున్న మహాధర్నాకు వనపర్తి జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రక్రియపై చేపట్టనున్న ఢిల్లీలో నిర్వహించే మహాధర్నాకు ఏఐసీసీ పిలుపునిచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి ఆదేశించారు. ప్రతి మండలం నుంచి 500 మంది పట్టభద్రులను, ప్రతి మున్సిపాలిటీ నుంచి 800 నుంచి 1,000 మంది వరకు ఓటర్లుగా నమోదు చేయించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని గ్రామాలు, మండలాల్లో పూర్తిస్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మండలాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా కమిటీకి నివేదికలు సమర్పించాలని మండల అధ్యక్షులకు సూచించారు. గ్రామ, మండలస్థాయి సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సమావేశాల్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు, వాటి పురోగతికి సంబంధించిన వివరాలను ఫొటోలతో సహా జిల్లా కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాలపై రూపొందించే నివేదికలను టీపీసీసీకి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. వచ్చే నెలలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



ఎగ్జిక్యూటివ్ సమావేశంలో మాట్లాడుతున్న శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

**కరువుపై బీఆర్ఎస్ ప్రచారం హాస్యాస్పదం...**

అనంతరం స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ...బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల వైఖరిపై విమర్శలు గుప్పించారు. దేశంలో గత 12 ఏళ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలు, వైఫల్యాలను కాంగ్రెస్ నాయకులు ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ జరగాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను వాస్తవాలతో సహా ప్రజల ముందుంచాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో కరువు పరిస్థితులపై బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉందని మేఘారెడ్డి విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలు కరువు, నీటికొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో తెలంగాణలోనే కరువు ఉన్నట్లు చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, తాగునీటిని పొదుపుగా వినియోగించడం, పశుసంపదను, ప్రకృతిని కాపాడుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజా సమస్యలపై రాజకీయాలు చేయడం కంటే ప్రజలకు అండగా నిలవడమే ముఖ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు రాష్ట్రంలో ప్రతిపక్షాల ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై ప్రభుత్వాల విధానాలు, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ, రానున్న రాజకీయ కార్యక్రమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ఓటరు నమోదు, గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు, ప్రజా సమస్యలపై కార్యాచరణ తదితర అజెండా అంశాలను సమీక్షించారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు రాజ్‌కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఐయూబ్ ఖాన్, వనపర్తి మండల అధ్యక్షులు నక్క రవి కిరణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, జిల్లా నాయకులు బోయజ్, నరహరి, విష్ణు ముదిరాజ్, శ్రీలత రెడ్డి, యాదగిరి, పలువురు పాల్గొన్నారు.

## కల్తీ మిర్చి విత్తనాలతో
# రైతులకు తీవ్ర నష్టం

- నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలి
- కంపెనీ యజమానులపై చర్య తీసుకోవాలి
- సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న



మిర్చి పంట పొలాలను పరిశీలించిన మండలం సిపిఎం ప్రతినిధి బృందం

**నాగర్ కర్నూల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** పనిచేయని నకిలీ మిర్చి విత్తనాలు ఇచ్చి రైతులను తీవ్ర నష్టపరిచిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని తాడూరు మండల సిపిఎం కార్యదర్శి అంతటి కాశన్న డిమాండ్ చేశారు. తాడూరు మండలంలోని గుంత కోడూరు గ్రామంలో ఆదివారం నాడు మిర్చి పంట రైతుల పొలాలను తాడూరు మండలం సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న మాట్లాడుతూ మిర్చి విత్తనాల నాణ్యతపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుప పంట చేను కంపెనీ, కలాష్ కంపెనీ, కుబేర్ 305, ఈషాకంపెనీ, రాఖీ రకం మిర్చి విత్తనాలను సాగుచేసిన రైతుల పొలాలను సీపీఎంపార్టీ తాడూరు మండలకార్యదర్శి అంతటి కాశన్న, మండల కమిటీ సభ్యులు చెన్న శ్యాంసుందర్ ఏనుపోతుల కాశన్న సందర్శించి పంటను పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు – మిగతా4లో..

## రోడ్డు పనులను
# వేగవంతం చేయాలి : మంత్రి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

**నర్వ, అక్టోబరు 25 ప్రభాతవార్త:** నర్వ మండల పరిధిలోని నాగి రెడ్డి పల్లి ఉంద్యాల బిటి రోడ్డు పనులను వేగవంతం చేయాలని మక్తల్ ఎమ్మెల్యే, తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం నాగి రెడ్డి పల్లిలో చేపట్టిన రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులను త్వరగా పూర్తిచేయాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని, ఖచ్చితంగా నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాగిరెడ్డి పల్లి సర్పంచు, ఉప సర్పంచ్, మాజి సర్పంచి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శరనప్ప, రామ కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిండిపై రెచ్చగొట్టొద్దు

**రెండు జిల్లాల ప్రజలు కొట్టుకునే పరిస్థితి తేవద్దు**

**డిండి లిఫ్ట్ రద్దు చేయాలి, లేదంటే**

**పోరాటం ఉధృతమౌతుంది**

**త్వరలో పెండింగ్ ప్రాజెక్టులను సందర్శన**

**చేపడతాం : ఎంపీ డీకే అరుణ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 25 ప్రభాత వార్త:** డిండి ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలనేది పాలమూరు ప్రజలు, రైతాంగం యొక్క ప్రధాన డిమాండ్ అని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో డీకే అరుణ మాట్లాడుతూ.. డిండి ప్రాజెక్ట్ ద్వారా 0.6 టీఎంసీల నీటిని తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇది ముమ్మాటికి ఈ ప్రాంత రైతుల నోట్లో మట్టి కొట్టడమేనని డీకే అరుణ మండిపడ్డారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పదేపదే డిండి పై మాట్లాడుతూ పాలమూరు రైతులను రెచ్చగొట్టడం మానుకోవాలని, గుత్తా సుఖేందర్ రెడ్డి, తన పై చేసిన వ్యాఖ్యలను ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. నల్గొండ జిల్లా నీటి సమస్య పరిష్కారానికి నక్కలగండి, నాగార్జున సాగర్, ఎస్ఎల్బీసీ (ఎస్ఎల్‌బిసి), మల్లన్న సాగర్ వంటి అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, అక్కడి నుంచి నీరు తీసుకోవాలే తప్ప, ఫ్లోరైడ్ సమస్య పేరుతో ఇక్కడ రాజకీయాలు చేయవద్దన్నారు. పట్టుదలకు పోయి భవిష్యత్తులో రెండు జిల్లాల ప్రజలు, రైతులు తరతరాలు కొట్టుకునే పరిస్థితిని తీసుకురావద్దని సూచించారు. జాతీయ పార్టీలో ఉన్నంత మాత్రాన రైతులకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించవద్దా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టు అసలు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టే కాదని, గతంలో జూరాల బదులు శ్రీశైలం బ్యాక్ వాటర్‌కు నీటి అప్రోచ్ మార్చినప్పుడే ఈ ప్రాజెక్టు అసలు లక్ష్యం దెబ్బతిన్నదని విమర్శించారు. 72 జీవోలో డిండి ద్వారా నీళ్లు తరలించడం ఎక్కడా లేదని గుర్తుచేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును మొదటి డీపీఆర్ (డిపిఆర్) ప్రకారం రివ్యూ చేసి వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో పోలవరం మాదిరిగానే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ఆనాడు ఢిల్లీ సమావేశంలో తానే స్వయంగా అడిగానని గుర్తుచేశారు. ప్రస్తుతం ఖిజాతీయ హోదాఖి అనే పదమే లేదని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడానికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని గతంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా మీడియా ముఖంగా చెప్పారని, కేవలం రాజకీయాల కోసమే ఇటువంటి విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమిషన్లపై ఉన్న ధ్యాస, ప్రాజెక్టులను పూర్తి చేయడంపై లేదని డీకే అరుణ ఆరోపించారు. గత మూడేళ్లలో పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తి కాలేదని, చివరికి జూరాల ప్రాజెక్టు మరమత్తులకు కూడా నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. పాలమూరు జిల్లాలో పుట్టి పెరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని, గతంలో కేసీఆర్ పాలమూరుకు ఉరితాడు వేస్తే, రేవంత్ రెడ్డి ఆ ఉచ్చును బిగిస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మూడేళ్ల పాలనలో పాలమూరుకు చేసింది ఏమీ లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, డిండి లిఫ్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిండి లిఫ్ట్ రద్దు కోసం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, త్వరలోనే పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల సందర్శన చేపడతామని ప్రకటించారు. భవిష్యత్ కార్యాచరణను అందరితో చర్చించి త్వరలోనే వెల్లడిస్తామని ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఈ ప్రెస్ మీట్ బీజేపీ ముఖ్య నాయకులు వీర బ్రహ్మాచారి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు కిరణ్ కుమార్ రెడ్డి, మర్రి జ్యోతి, పాండు రంగారెడ్డి, నందిపేట రాజు, శివ నాయక్, తిరుపతి తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

## ఎల్‌నినో ప్రభావం..
# అన్నదాతకు అగ్నిపరీక్ష!



వాటర్ ట్యాంక్‌తో పంటకు నీరు పడుతున్న రైతు

**దామరగిద్ద, అక్టోబరు 25 ప్రభాతవార్త :** వాతావరణ మార్పులతో గ్రామీణ వ్యవసాయానికి సవాళ్లు.. ముందస్తు ప్రణాళికే పరిష్కారం గ్రామీణ వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక. రైతు జీవితానికి వర్షమే జీవనాధారం. కానీ మారుతున్న వాతావరణ పరిస్థితులు, అస్థిరమైన వర్షపాతం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అన్నదాతను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తరచుగా వినిపిస్తున్న ఎల్‌నినో అనే వాతావరణ పరిణామం గ్రామీణ ప్రాంతాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఎల్‌నినో అంటే ఏమిటి?...**

సాధారణంగా పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరిగే వాతావరణ పరిణామాన్ని ఎల్‌నినో అంటారు. ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నమూనాలను ప్రభావితం చేయగలదు. భారతదేశంలో రుతుపవనాల వర్షపాతంపై కూడా దీని ప్రభావం ప్రస్తుతం ఉంది. అయితే ఎల్‌నినో ఏర్పడిందంటే తప్పనిసరిగా కరువు వస్తుందని చెప్పలేం. వర్షపాతంపై దాని ప్రభావం ఇతర వాతావరణ పరిస్థితులపై కూడా ఆధారపడి ఉంటుంది.

**రైతన్నకు పెరుగుతున్న నీటి కష్టాలు...**

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగా సాగుతుంది. వర్షాలు లేకపోవడంతో పంటలను కాపాడుకోవడం కోసం కొంతమంది రైతులు నీటి ట్యాంకర్ల ద్వారా – మిగతా4లో..

# నువ్వు వెయ్యి మందితో వస్తే.. నేను 50వేల మందితో వస్తా..

**మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి ఎమ్మెల్యే**

**మేఘారెడ్డి సవాల్**

**గత పాలనలో వనపర్తి విధ్వంసం..**

**ప్రజలను భయబ్రాంతులకు**

**గురిచేశారని ఆరోపణ**

**బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటన**

**వనపర్తి, ప్రతినిధి, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యలపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. వయసుకు తగ్గట్టుగా మాట్లాడాలని హితవు పలుకుతూ.. నువ్వు వెయ్యి మందితో వస్తే.. నేను 50 వేల మందితో వస్తా అంటూ సవాల్ విసిరారు. గతంలో అహంకారపూరిత పాలన సాగించారంటూ ప్రజలు ఓడించినా తీరు మారలేదని విమర్శించారు. వనపర్తి ప్రజలు విజ్ఞులు, మేధావులని, రాజకీయ పరిణామాలను గమనిస్తున్నారని అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేఘారెడ్డి మాట్లాడారు. 2014 నుంచి 2023 వరకు నిరంజన్‌రెడ్డి పాలనలో వనపర్తి అభివృద్ధి పేరుతో నష్టపోయిందని ఆరోపించారు. 32 మంది బీసీ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించారని, విలేకరులపైనా అట్రాసిటీ కేసులు నమోదు చేసిన సందర్భాలున్నాయని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నిరుద్యోగులు, వివిధ వర్గాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ఉద్యోగాల పేరుతో పోస్టులకు ధరలు నిర్ణయించి కమిషన్లు వసూలు చేశారనే ఆరోపణలు కూడా చేశారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజల తీర్పును గౌరవించాలి...**

నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని మేఘారెడ్డి సూచించారు. నిరంజన్‌రెడ్డి అహంకారపూరిత వైఖరికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. నాగర్‌కర్నూల్‌లో పుట్టి, కొల్లాపూర్‌లో పెరిగి, వనపర్తిలో రాజకీయ ఆధిపత్యం చెలాయిస్తామంటే కుదరదన్నారు. ఎంతమందితో వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. నడిబజారులో చెప్పుతో కొడతానంటూ మాట్లాడటం రాజకీయ సంస్కృతికి నిదర్శనం కాదని విమర్శించారు.

**బహిరంగ చర్చకు సిద్ధం...**

బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై ప్రజల సమక్షంలో చర్చించేందుకు సిద్ధమని మేఘారెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వ పాలనకు సంబంధించిన పత్రాలతో నిరంజన్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. అభివృద్ధి విషయంలో ఎవరి పాలన ఎలా ఉందో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. రానున్న ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ రావడంపైనా అనుమానం వ్యక్తం చేస్తూ, టికెట్ వచ్చినా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. వనపర్తి రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, బెదిరింపుల కంటే అభివృద్ధి, ప్రజాసేవకే ప్రాధాన్యం ఇవ్వాలని మేఘారెడ్డి అన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హాస్పిటల్స్‌పై పర్యవేక్షణ ఏది

**జడ్చర్ల ఆసుపత్రిలో మృతదేహాలు కుళ్ళిపోవడం దారుణం**

**ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్వహణ గాలికి**

**వదిలేసిన కాంగ్రెస్ సర్కార్**

**కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్న**

**రోగులు, ప్రజలు ; మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి**



**జడ్చర్ల, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** జడ్చర్ల వంద పడకల హాస్పిటల్ మార్చురీలో మృతదేహాలు కుళ్ళిపోవడం దారుణమని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి అన్నారు. అత్యవసర సేవలు అందించే గవర్నమెంట్ హాస్పిటల్ కి కోతల్లేని విద్యుత్ ఇవ్వలేక పోతుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్తులు మరణించి తీవ్ర దుఃఖంలో ఉండే కుటుంబ సభ్యులకు మృతదేహాలను గౌరవంగా అప్పగించాల్సిన బాధ్యత ఉంటుందని కానీ నిరక్ష్యంతో కుళ్ళిన మృతదేహాలు ఇవ్వడం హేయమైన చర్య అన్నారు. గతంలో కూడా మృతదేహాలను కుక్కలు పీక్కుతినడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి ఘటనలు చూశామని అయినప్పటికీ హాస్పిటల్ లో సేవలు మెరుగు పడలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్య సేవలు, వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చెరుకు రైతులకు బోనస్ ఇవ్వాలి

**మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం**



రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రమిస్తున్న దృశ్యం

**అమరచింత అక్టోబర్ 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యం పండించిన రైతులకు బోనస్ ఇస్తున్న మాదిరిగానే చెరుకు రైతులకు క్వింటాలుకు 1000 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరచింతలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీవన్ గోపి,చెరుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి తిరుమలేష్ కౌన్సిలర్ మాట్లాడుతూ, కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ పరిధిలో10,500 ఎకరాలలో రైతులు చెరుకును పం డిస్తున్నారని చెరుకు రైతులకు మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023లో కాంగ్రెస్ ఎన్నికల మేని ఫేస్టోలో చెరుకు రైతులకు 1000 బోనస్ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే చెరుకు రైతులకు టన్నుకు ఆరు వేల ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్ కుమార్, గోపాల్ రెడ్డి, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

## గ్రామాలలో గ్రామ ఐక్య సంఘాల ఏర్పాటు



మామిడి మాడ గ్రామంలో ప్రసంగిస్తున్న జస్వంత్

**ఖిల్లా గణపురం అక్టోబర్ 25,ప్రభాతవార్త :** గ్రామాలలో రైతులు మహిళలు యువకుల భాగస్వామ్యంతో గ్రామైక్య సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని హెచ్ఎస్బిసి బ్యాంక్ వారి సహకారంతో అసిస్ట్ సేవా సంస్థ వారు ఆదివారం మామిడిమాడ గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అసిస్ట్ టీం సంస్థ వారు జస్వంత్,శేఖర మాట్లాడారు మండలంలో మామిడి మాడ గ్రామంతో పాటు 10 గ్రామాలను మా సంస్థ ఎంపిక చేసిందని ఈ గ్రామాలలో ముందుగా గ్రామైక్య సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని పార్టీలకు అతీతంగా రైతులు మహిళలు యువకులు మేధావులతో గ్రామ సంఘం యొక్క టీమ్ను ఎంపిక చేస్తామని ఇందులో అన్ని వర్గాల వారు సభ్యత్వం తీసుకోవచ్చన్నారు. దీంతో గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి గ్రామ అభివృద్ధి కమిటీ నిర్ణయం మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతామన్నారు దీంట్లో సభ్యులుగా చేరే వారు తమకు తోచిన విధంగా నెలకు 30 రూపాయలు నుండి 100 రూపాయల వరకు నెలవారిగా జమ చేసుకోవచ్చని వీరు జమ చేసిన నిధులకు తోడుగా మా సంస్థ నుంచి నిధులను సమీకరించి పనులు చేపడతామన్నారు. రైతులకు కూడా వారి వ్యవసాయ పొలాలు చదును చేయడం కుంటలు నిర్మించడం తోటలు ఏర్పాటు చేయడం జరుగుతుందని దీనిని ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో కళాజాత బృందం చే అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పార్వతీతోపాటు పలువురు కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

## రామన్ పాడ్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ



స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**మదనాపురం,అక్టోబరు 25 ప్రభాతవార్త:** మండలపరిధిలో రామన్‌పాడ్ గ్రామంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ ఆఫ్రీన్ బేగం అంజద్అలీ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని, కొత్త కార్డులు వాటర్ ప్రూఫ్‌తో పాటు పలు భద్రతా ఫీచర్లు, క్యూఆర్ కోడ్‌తో ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సన్నబియ్యం పథకం ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు. శ్రీధర్ రెడ్డి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసింహ గౌడ్, నాయకులు కృష్ణరెడ్డి,పాషా,ఖదీర్,కుర్మన్న,రామకృష్ణ,రాజన్న,కిషన్ నాయక్,విష్ణు, నరసింహ,బాలు నాయక్ రేషన్ డీలర్ వినోద్ లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మక్తల్ పట్టణ పారిశుద్ధ్యంపై బీఆర్ఎస్ పోరుబాట



పారిశుద్ధ్య కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు

**మక్తల్,అక్టోబర్ 25 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి పది లక్షల వ్యయంతో అత్యంత సుందరంగా బస్టాండు ఆవరణలో నిర్మించిన మక్తల్ బోర్డు వద్ద చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా మారినా పుర పాలక పాలక మండలి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహ గౌడ్, మాజీ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిన్న హనుమంత్ మాట్లాడుతూ మక్తల్ పురపాలక సంఘం పారిశుద్ధంలో పూర్తిగా వెనుకబడిపోయిందని ఆరోపించారు. పురపాలక కమిషనర్ కు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా క్లీన్ అండ్ గ్రీన్ పై దృష్టి పెట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో జుబ్బేర్ పాషా, మాజీ బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గవినోళ్ల నర్సింహరెడ్డి, మాజీ కౌన్సిలర్లు అన్వర్ హుస్సేన్, జగ్గలి రాములు, మొగులప్ప, టేకులపల్లి సర్పంచ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ ఆశిరెడ్డి, ఈశ్వర్ యాదవ్, శివా రెడ్డి, కుమ్మరి రవి, సాదిక్, జుట్ల సాగర్, చందపురం అశోక్ గౌడ్, మన్నన్, బాల్చేడ్ రాజు, వనకర్ రాజు, గుంటి రఘు, విభూతి మారెప్ప, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వండి: మద్దూరు ఎస్ఐ విజయ్ కుమార్**



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**మద్దూరు,అక్టోబరు 25 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా, మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల రోడ్డు మార్గంలో దినేష్ రైస్ మిల్ సమీపంలో ఆదివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో విద్యుత్ స్తంభానికి ఉరివేసుకున్న స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది.మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలు లభించలేదు.మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే లేదా అతని కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు తెలిసినట్లయితే వెంటనే కింది నంబర్లకు తెలుపగలరు 1. మద్దూర్ ఎస్సై: 87126 70407 2. మద్దూర్ పోలీస్ స్టేషన్ : 8712671026

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన



ఎమ్మెల్సీ ఓటరు నమోదు పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నర్వ,అక్టోబరు 25 ప్రభాతవార్త :** నర్వ మండలకేంద్రములో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహణ కల్పించారు.ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ బంగ్లా లక్షీ ్మకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి పట్టభద్రు లను కలిసి పలు సూచనలు చేశారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ గురించి వివరించారు. నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని,1 నవంబర్ 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు.ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.పలు వు రిని ఫారం 18ద్వారా దరఖాస్తును చేయించారు.మండల బీజేపీ అధ్యక్షులు అజిత్ సింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్,జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు బొజ్జన్నజిల్లా కార్యదర్శి అయ్యప్ప స్వామి,నర్వ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రావు,మండల బీజేపీ నాయకులు వావిళ్ళ వెంకటేశ్వర రెడ్డి,నర్వ బూత్ అధ్యక్షులు కిస్టారెడ్డి,అయ్యన్న,హనుమంత్ రెడ్డి,రామ్ రెడ్డి, బుచ్చి రెడ్డి,రామచంద్రీ,బోయ పెద్ద అంజి,సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

**ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోంది**

**1న ఢిల్లీలో మహాధర్నా: డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి చీఫ్ శివసేన రెడ్డి

**వనపర్తి, అక్టోబరు 25, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవడం అత్యంత కీలకమని డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారంటూ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.ఓటుహక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఓట్‌బచావో.. దేశ్‌బచావో ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు.ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివసేన రెడ్డి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటరే కీలకమని, ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలను సహించబోమన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఓటు చోరీ అంశంపై ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రజెంటేషన్ ద్వారా దేశ ప్రజలకు వివరించారని గుర్తుచేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న మహాధర్నాకు వనపర్తి జిల్లా నుంచి 300 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని వెల్లడించారు. ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఏఐసీసీ నేత, ఉమ్మడి జిల్లాల ఓట్ బచావో.. దేశ్ బచావ్తో కార్యక్రమ పరిశీలకుడు రవీంద్రదాస్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు అత్యంత కీలకమన్నారు. ప్రజల ఓటుతో ఏర్పడిన ప్రభుత్వాలు అదే హక్కును దెబ్బతీసేలా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని పేర్కొన్నారు. ఓటు హక్కును కాలరాసే ప్రయత్నాలను ప్రజలు సహించరని, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్ధేశ్వర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ శత్రుబుజ్జి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, బి.కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, వివిధ మండలాల నాయకులు, జిల్లా, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా 2001,2002 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై గురువులు, శిష్యులు**

**25 ఏళ్ల స్నేహ బంధానికి ప్రతీకగా వేడుకలు**



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**దేవరకద్ర,అక్టోబరు 25 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కౌకుంట్ల 2001,2002 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడంతో ప్రాంగణం ఆనందోత్సవాలతో నిండిపోయింది. ఈ సందర్భంగా ముందుగా పూర్వ విద్యార్థులు తమ గురువులకు పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ముందుకు సాగేందుకు మార్గ నిర్దేశం చేసిన గురువుల సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు అయిన జగదీశ్వరయ్య, రామ్‌రెడ్డి, రామాచారి, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, భాగ్య రేఖ, విజయ్ కుమార్, అబ్దుల్ గని, వహీద్, ఉమాపతి రెడ్డి, రాములు, రామా శర్మ,ముస్తఫా, లను పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. తమకు విద్యాబోధన చేసిన గురువులకు ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడం పూర్వ విద్యార్థుల్లో ఆనందం నింపింది. అనంతరం దివంగత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేసిన నిర్వాహకులకు కూడా శాలువతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. చిన్ననాటి స్నేహాలు,తరగతి గది అల్లర్లు ఆటపాటలు గురువుల మందలింపులు వారు నేర్పిన జీవిత పాఠాలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. అనంతరం 25 ఏళ్ల స్నేహ బంధానికి ప్రతీకగా కేక్ కటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి

**రైతుల సమస్యలపై నేడు కలెక్టరేట్ ఎదుట తెలంగాణ రక్షణ సేన ధర్నా**



గవినోళ్ల శ్రీనివాస్

**దామరగిద్ద, అక్టోబరు 25 ప్రభాతవార్త:** నారాయణపేటజిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నేడు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు.జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. పంటల సాగు, దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు పెట్టుబడుల భారం రైతులను ఆర్థికంగా కుంగదీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.అర్హులైన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని గవినోళ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు.రైతుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ధర్నాలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వర్షాభావముతో ఎండుతున్న పంటలు ఆందోళనలో రైతులు

**బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**



పంటలను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

**మిడ్జిల్,అక్టోబరు25 ప్రభాతవార్త:** మిడ్జిల్ మండలం పలు గ్రామాల్లో వర్షపాతం పరిస్థితులు సాగునీటి కొరత విద్యుత్ సరఫరా అంతరాయాల కారణంగా పంటలు ఎండిపోతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి మండలంలోని పలు గ్రామాలలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు కోసం పెట్టిన పెట్టుబడుల తిరిగి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. నేరుగా నేరుగా రైతులతో మాట్లాడుతూ పంటల పరిస్థితి సాగునీటి సమస్యలు పెట్టుబడి వ్యాయామం గురించి అడిగి రైతులను తెలుసుకున్నారు. ప్రభుత్వము వెంటనే సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను వేగవంతం చేసి సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలని పంటలు ఎండిపోవడంతో నష్టం పోయిన రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. సాగునీరు విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందడానికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వారికి సూచించారు. గెలుపే దిశగా ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కిషన్ యువమోర్చా నాయకులు వెంకటరెడ్డి,జిల్లా కిషన్ మోర్చా సభ్యులు రామకృష్ణ, మురళి కృష్ణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బిజెపి జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, బిజెపి మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, సోషల్ మీడియా అరుణ్ కుమార్, మండల కార్యదర్శి వాసుదేవు, శేఖరు, విష్ణు, ఆంజనేయులు, మహిళా మోర్చా సహజ బేగం, దేవేందర్, మధు, జంగయ్య, లాలు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# పునరావాసంపై సహకరించండి : పునరావాస కమిటీ



మాట్లాడుతున్న పునరావాస కమిటీ అధ్యక్షులు సాయిబాబు

**అచ్చంపేట, అక్టోబరు 25 ప్రభాతావార్త :** అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ కోర్ ఏరియా ఏటీఆర్ నుండి స్వచ్ఛంద పునరావాసానికి ముందుకొచ్చిన సుమారు 450 మంది గ్రామస్థులు ఇంకా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పునరావాస కమిటీ అధ్యక్షులు సాయిబాబు కోరారు. ఆదివారం వటువర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పునరావాస కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడుతూఅమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని వట్టవర్లపల్లి గ్రామంలో స్వచ్ఛంద గ్రామపునరావాస ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన ఎంఓయూ (లీవీగీ) ఒప్పంద పత్రాలపై సంతకాల కార్యక్రమంలో సుమారు 450 మంద గ్రామస్థులుస్వచ్ఛందంగా సంతకాలు చేశారన్నారు. ఇంకా కొంతమంది కూడా స్వచ్ఛందంగా ఎంఓయూ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు, గ్రామ పునరావాస ప్రక్రియ అనేది ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసం చేపడుతున్న స్వచ్ఛంద ప్రక్రియ అని తెలిపారు. తమ కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పునరావాసానికి ముందుకొస్తున్న ప్రతి కుటుంబం నిర్ణయాన్ని గౌరవించాలని పేర్కొన్నారు.పునరావాసానికి అంగీకరించిన వారిని నకిలీ వ్యక్తులుగా చిత్రీకరించడం సరికాదని, ప్రతి వ్యక్తి అర్హత, హక్కులు, దరఖాస్తులు, సంబంధిత అధికారిక రికార్డుల ఆధారంగా విషయాలను పరిశీలించాలని కమిటీసభ్యులు పేర్కొన్నారు.గ్రామంలో నివసిస్తున్నవారైనా, వివిధ కారణాలతో గ్రామం వెలుపల ఉంటున్నవారైనా, వారి వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించకుండా ఆరోపణలు చేయడం సమంజసం కాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ . బాలరాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జహంగీర్, కమిటీ సభ్యులు జానకిరాములు, గంధర్ సూర్యం, కరీం, శంషుందర్, శివప్రసాద్, ఎం.డి.నిరంజన్, ప్రవీణ్ గ్రామస్థులు శ్రీను, పాత్య నాయక్, జూలు నాయక్, కర్నాటి శ్రీను, అరువంటి పరమేష్, లచ్చిరాం, మోతియా, సాదిక్, బలమియా, నిరంజన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

**ఆపద సమయాల్లో అండగా ఉంటామని భరోసా**



ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్య మిత్రులు

**కోయిలకొండ అక్టోబర్ 25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కోయిలకొండలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 2016 2017ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన మండలంలోని ఆచార్యపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు గత మూడు,నాలుగు రోజుల కిందట మరణించాడు. విషయము తెలుసుకున్న బాల్యమిత్రులు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి మేమంతా మీ కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబసభ్యులకు భరోసా నిచ్చి 33వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అకాలమరణం చెందిన తోటిమిత్రుడు ఆంజనేయులు జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన 2016.2017 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులను గ్రామస్తులు అభినందించారు.

## శివాలయ అభివృద్ధి కోసం విరాళం

**భూత్పూర్,అక్టోబర్ 25,ప్రభాతవార్త :** తమ గ్రామ శివాలయం అభివృద్ధికోసం ఆర్థికసహాయం అందించాలని గాజులపేట గ్రామానికిచెందిన శివాలయ అభివృద్ధి కమిటీసభ్యులు,గ్రామస్తులు బీఆర్ఎస్ నియోజకవర్గం నాయకుడు,హైకోర్టు అడ్వకేట్ మందడిసరోజ్‌రెడ్డి(ఎంఆస్ఆర్)ని శేర్పల్లిలోనిఆయన నివాసంలో కలువగా,వారికి తన వంతు విరాళంగా రు.20వేల నగదును అందించి ఎంఎస్ఆర్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

## ప్రీఆర్డీ పరేడ్‌కు పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి ఎంపిక

**అభినందించిన వీసీ, రిజిస్ట్రార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్**



**మహబూబ్‌నగర్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ స్థాయి ప్రీరిపబ్లిక్ డే పరే డ్ ఎంపికల్లో యూనివర్సిటీ పీజీ కళా శాల ఎం.ఎస్‌డబ్ల్యూ ద్వితీయ సంవ త్సరం విద్యార్థి జి.రాణాప్రతాప్ ఎంపిక య్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ,విద్యార్థులు చదువుతో పాటు ఎన్ఎస్ఎస్ వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం అభినందనీయం. క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలి" అని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్ బాబు , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కె. ప్రవీణ కూడా విద్యార్థులను అభినందించారు.

## నర్వలో వాల్మీకి జయంతి వేడుకలు



**నర్వ,అక్టోబరు 25 ప్రభాతవార్త:** మండల అధ్యక్షులు కావలి అయ్యన్న.నేడు నర్వ మండల కేంద్రములో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వాల్మీకి సంఘం నర్వ మండల అధ్యక్షులు కావలి అయ్యన్న తెలిపారు. మండలం లోని ఆయా గ్రామాల్లో ఉదయం 9:00 గంటలకు జయంతి వేడుకలను జరుపుకోవాలని సూ చించారు.ఆ తర్వాత ఉదయం 9:30 నిమిషాలకు మండల కేంద్రము లోనీ వాల్మీకి మహర్షి ఆలయం వద్ద నిర్వహించే జయంతి వేడుకలలో పాల్గొనాలన్నారు.ముందుగా వాల్మీకి మహర్షి దేవాలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమం,అనంత రం జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వాల్మీకి సోదరులు అధిక సం ఖ్యలో పాల్గొని వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను విజయ వంతం చేయాలన్నారు.

## మాజీ మంత్రి పరామర్శ



నర్సింహులును పరామర్శిస్తున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్,అక్టోబరు 25 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌విఎస్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న టంకర గ్రామానికి చెందిన రాజలింగం, కోడూరు గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ డైరెక్టర్ నర్సింహులును మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యచికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలోని మల్లికా ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సద్దులగుండుకి చెందినకార్పొరేటర్ నరేష్ తండ్రి శ్రీనివాసులు,మైత్రి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న దాచకపల్లి గ్రామానికిచెందిన మాజీ డిప్యూటీసర్పంచ్ మధు,అభయప్రభ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నదర్పల్లి గ్రామానికిచెందిన వెంకటయ్య మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్య చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. ధైర్యంగా ఉండాలన్నారు.

## శివాలయం ఆంజనేయస్వామి దేవాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ,అక్టోబర్ 25 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామంలో నిర్మిస్తున్న శివాలయం ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.1,00,116లను చారగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన ఏ మణిపాల్ రెడ్డి తహసీల్దార్ విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వీరారెడ్డి, శ్రీకాంత్ రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలి

**కాంగ్రెస్ జాతీయ నాయకుడు రవీంద్రనాథ్**



మాట్లాడుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకుడు రవీంద్రనాథ్

**నాగర్‌కర్నూల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కాంగ్రెస్ జాతీయ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రవీంద్రనాథ్ తెలిపారు. ఓటు బచావో.. దేశ్ బచావో నినాదంతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి 15 వేల మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్లపై వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.పనికిమాలిన నిబంధనలు పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారని దేశంలో ఎంతోమంది ఓటర్లను అక్రమంగా తొలగించి హోటల్ నిన్ను ఇష్టపరుస్తున్నారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా అధ్యక్షులు వంశీ కృష్ణ, ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

**నవాబుపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త :** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. నవాబుపేట మండల పరిధిలోని ఎనుమనుగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి, పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్ననాటి స్నేహాలు, తరగతి గదిలో చేసిన అల్లరి, ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలు, క్రమశిక్షణతో పాటు జీవితంలో ముందుకు సాగేందుకు వారు అందించిన ప్రోత్సాహాన్ని గుర్తుచేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో ఎదురైన అనుభవాలను, ప్రస్తుతం తమ జీవితాల్లో సాధించిన విజయాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఆనందంగా గడిపారు. 25 సంవత్సరాల తర్వాత స్నేహితులు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను కలవడం జీవితంలో సుదూర ప్రాంతాల నుండి ఎక్కడెక్కడో స్థిరపడి ఉపాధ్యాయులు సూచించిన మార్గంలో నడుస్తూ ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాత స్నేహాలు మళ్లీ చిగురించాయి. కాలం మారినా, వయసు పెరిగినా పాఠశాల జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మధురమేనని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పాత జ్ఞాపకాలను మళ్లీ గుర్తుచేసుకునే మధురమైన వేదికగా నిలిచింది.

## అంబేద్కర్ విగ్రహ దిమ్మె నిర్మాణానికి భూమి పూజ

**స్వచ్ఛంద సేవకుడు జరుపుల భాస్కర్ నాయక్**


భూమిపూజలో పాల్గొన్న నాయకులు

**మిడ్జిల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వెలుగోముల గ్రామంలో ఆదివారం నాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ దిమ్మె నిర్మాణానికి స్వచ్ఛంద సేవకుడు జడ్పుల భాస్కర్ నాయకుడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమానత్వము సామాజిక న్యాయము భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని తెలిపారు. గ్రామంలో డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దిమ్మె నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. దిమ్మె నిర్మాణానికి కావాల్సినటువంటి ఖర్చును తానే భరిస్తానని సందర్భంగా వెల్లడించారు. అనంతరం జరుబుల భాస్కర్ నాయకులు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ముంగి సువర్ణమ్మ, ఉప సర్పంచ్ లక్ష్మమ్మ వెంకటయ్య ,వార్డు సభ్యులు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, అంబేద్కర్ యువజన సభ్యులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, వివిధ ప్రజా నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సేవాదళ్‌తో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి**


సేవాదళ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

**వనపర్తి, అక్టోబరు 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు సేవాదళ్ కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి పిలుపునిచ్చారు. సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహిస్తున్న జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సేవాదళ్ కార్యకర్తలు ప్రజాసేవలో ముందుండాలన్నారు. ప్రతి నెలా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా కార్యకర్తల్లో క్రమశిక్షణ, ఐక్యత, సేవాభావం పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గొర్ల జానకిరాములు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మండల అధ్యక్షులు నరహరి, రామ్‌రెడ్డి, సుల్తాన్, సుఖేందర్‌రెడ్డి, కోళ్ల వెంకటేష్, బి.కృష్ణ, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, శ్రీను, యాదగిరి, మన్యం, పాండు సాగర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ల ఫోరమ్ మండల అధ్యక్షుడిగా రవీందర్ నాయక్


నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**బాలానగర్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరమ్ ఆధ్వర్యంలో బాలానగర్ మండల నూతన అధ్యక్షు డిగా చింతకుంట తండాకు చెందిన రవీందర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సం దర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ, త నపై నమ్మకం ఉంచి మండల వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యుల సమ స్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అందరి సహకారంతో ఐకమత్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా వార్డు మెంబర్ల ఇంచార్జి చిన్నారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, గౌరవ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, జావీద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌తో పాటు బాలానగర్ మండల వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ఫోటోగ్రఫీ పోటీలో వనపర్తి ఫోటోగ్రాఫర్‌కు అవార్డు

**కలర్‌ఫుల్ లైట్ చిత్రానికి హానరబుల్ మెన్షన్**

**హైదరాబాద్‌లో ఫోటో పుస్తకావిష్కరణ, ప్రదర్శన**


అవార్డు అందుకుంటున్న ఎస్‌వి రమేష్

**వనపర్తి, అక్టోబరు25, ప్రభాతవార్త :** తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలో వనపర్తికి చెందిన ఫోటోగ్రాఫర్ ఎస్.వి.రమేష్ అవార్డుకు ఎంపికయ్యారు. 2024 లో నిర్వహించిన మూడో క్వార్టర్లీ ఫోటోగ్రఫీ పోటీలో ల్యాండ్‌స్కేప్ విభాగంలో ఆయన తీసిన కలర్‌ఫుల్ లైట్ ఫోటోకు హానరబుల్ మెన్షన్ పురస్కారం లభించింది. వనపర్తిలోని నవీన ఫోటో పార్లర్‌కు చెందిన రమేష్ ఈ గుర్తింపు పొందడం పట్ల ఫోటోగ్రఫీ రంగానికి చెందినవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని మాదాపూర్ స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో ఫ్రోజెన్ ఇన్ టైమ్ - ఎ ఫోటోగ్రాఫిక్ ఓడ్‌టు కాకతీయ హెరిటేజ్ ఫోటో పుస్తకావిష్కరణ, అవార్డుల ప్రదానోత్సవం, ఫోటోగ్రఫీ ప్రదర్శన నిర్వహించారు.ఈకార్యక్రమానికి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్ డైరెక్టర్ డా.కె.లక్ష్మి,తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.అకాడమీ అధ్యక్షురాలు డా.సునీతా రావులపల్లి, ట్రెజరర్ కె.విశ్వేందర్‌రెడ్డి, కార్యదర్శి బండి వి.రమణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈనెల 24నుంచి 26వ తేదీవరకు ఫోటోగ్రఫీ ప్రదర్శన కొనసాగనుంది.

# మంగంపల్లి ఘటనపై ఐక్య పోరుకు పిలుపు

**ఆలయ ప్రవేశ నిరాకరణపై సమగ్ర విచారణ జరపాలి**

**బాధ్యులను అరెస్టు చేయాలి...**

**బాధితుడు సుధీర్‌కు రక్షణ కల్పించాలి**

**చలో కలెక్టరేట్ ముట్టడికి ప్రజాసంఘాల నిర్ణయం**



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సంఘాల నాయకులు

**వనపర్తి,అక్టోబరు 25, ప్రభాతవార్త :** పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఆలయ ప్రవేశాన్ని అడ్డుకుని, కులం పేరుతో దూషించారనే ఆరోపణలపై బాధితుడు మాసాని సుధీర్‌కు న్యాయం చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఆదివారం వనపర్తిలోని దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈమేరకు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అన్ని రాజకీయ పార్టీలు, దళిత, గిరిజన, బహుజన సంఘాలు, ప్రజాసంఘాలను కలుపుకొని చలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమ తేదీ, సమయాన్ని త్వరలో ప్రకటిస్తామని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, డీఎస్పీ నాయకుడు మంద సూర్యప్రకాష్ మహారాజ్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరపాగ గోవింద్, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ గంధం నాగరాజు తదితరులు మాట్లాడుతూ.. కులం పేరుతో దూషించడం, ఆలయ ప్రవేశానికి అడ్డంకులు సృష్టించడం వంటి చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.మంగంపల్లి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టం కింద నేరాలు జరిగినట్లు తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. బాధితుడు సుధీర్‌కు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. కులవివక్షకు వ్యతిరేకంగా, దళితుల ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజాసంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సమావేశంలో బంజారా గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్, డీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు మహారాజ్, బేడ బుడగ జంగం వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్యం, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, స్వేరో జిల్లా ఉపాధ్యక్షుడు దేవని శేఖర్, ఎస్సీ ఉపకులాల రాష్ట్ర నాయకుడు సిరివాటి శ్రీనివాసులు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు గంధం గట్టయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ నాయకుడు మొలకలపల్లి పరశురాముడు మాదిగ, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డి.శేఖర్, బహుజన నాయకుడు నాగన్న, బాధితుడు సుధీర్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎస్‌ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి

**భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత సమాజ మార్పునకు కృషి చేయాలి**

**గుమ్మడి నర్సయ్య, పోటు రంగారావు పిలుపు**


భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**దామరగిద్ద, అక్టోబరు 25 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య హక్కుల పరి రక్షణకు, సామాజిక న్యాయం సాధనకు యువత చైతన్యంతో ముందుకు రావాలని ఇల్లందు మాజీఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలు పునిచ్చారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.దామరగిద్ద మండలం ఉడ్మల్ గిద్ద గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ, పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వ ర్యంలో నిర్వహించిన సభకు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షత వహించా రు.ముఖ్య అతిథులుగా హాజరైన గుమ్మడి నర్సయ్య, పోటు రంగా రావు భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకో వాలని కోరారు.ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత, న్యాయబ ద్ధత పాటించాలని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని తెలిపారు.


మాట్లాడుతున్న నాయకులు

భగత్‌సింగ్ ఆశయాలకు అను గుణంగా యువత నిరుద్యోగం, పేదరికం, కులవివక్ష, మతతత్వం, విద్యారంగంలోని అసమానతలపై ప్రశ్నించాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని రాజ్యాంగ విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజాస్వామ్య వ్యవ స్థలు, పౌర హక్కులపై చూపుతున్న ప్రభావాన్ని ప్రజలు పరిశీలించాలన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్యా, వైద్య రంగాల్లో అసమానతలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.కులమతాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం సమాజ ఐక్యతకు విఘాతమని పేర్కొన్నారు.అంటరానితనం, కులవివక్ష, మత విద్వేషం, మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా యువత పోరాడాలని పిలుపునిచ్చారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం ప్రజలంతా సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. హన్మేష్, ప్రభాకర్, రామకృష్ణ, పుల్లయ్య, రామయ్య, అశోక్, నారాయణపేట జిల్లా కార్యదర్శి బి. రాము, డివిజన్ కార్య దర్శి కాశీనాథ్, న్యాయవాది కాలేశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, పార్టీ జిల్లా నాయకులు నర్సింహా, కొండా నర్సిములు, గ్రామ ఉపసర్పంచ్, పార్టీ గ్రామ కార్యదర్శి పి.తాయప్ప, సీపీఎం గ్రామ కార్యదర్శి గొర్ల పెంటప్ప, నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 109వ వారానికి చేరిన జెకె ట్రస్ట్ సేవా కార్యక్రమం


అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్న జెజె ట్రస్టు సభ్యులు

**నవాబుపేట,అక్టోబరు 25 ప్రభాతవార్త :** జీకే టెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివారం అన్నదాన కార్యక్రమం 108వ వారానికి చేరుకుంది. నవాబుపేట మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వారపు సంతకు వచ్చే ప్రజల కోసం జేకే కుటుంబ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత భోజన కార్యక్రమం 109వ వారానికి చేరుకుంది. ఆదివారం ఈ అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.నవాబుపేట మండల కేంద్రంలోని సంతకు చుట్టుపక్కల గ్రామాలు, తండాలతో పాటు దాదాపు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల నుంచి ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. సంతకు వచ్చే ప్రజలకు ఆకలి తీర్చాలనే సంకల్పంతో జేకే కుటుంబ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి వారం ఉచిత భోజనాన్ని అందిస్తున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిరంతరంగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం సంతకు వచ్చే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

**సేవే లక్ష్యంగా జేకే కుటుంబ ట్రస్టు...**

ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం గొప్ప మానవతా సేవ అని చాటి చెబుతూ జేకే కుటుంబ ట్రస్టు ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తోంది. వారం వారం సంతకు వచ్చే పేదలు, రైతులు, కూలీలు, వ్యాపారులు, ఇతర గ్రామాల ప్రజలకు ఉచిత భోజనం అందించడం ద్వారా సామాజిక సేవలో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోంది. 108 వారాలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం ట్రస్టు సేవా నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.ఈ కార్యక్రమానికి జేకే కుటుంబ ట్రస్టు చైర్మన్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ వి. నరసింహ చారి ఆధ్వర్యం వహిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం కేవలం దానం కాదు.. మానవత్వాన్ని పంచడం. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, సమాజంలో సేవాభావం పెంపొందాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# జనగణనలో ప్రత్యేక ఓబిసి కాలమ్ ఏర్పాటు చేయాలి

**ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలి: బీసీ జేఏసీ**


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**నాగర్‌కర్నూల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని బిసి ఓబిసి జేఏసీ డిమాండ్ చేసింది. అక్టోబర్ 25న జిల్లా కేంద్రంలో కమిటీ హాల్లో బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని మహాత్మా జ్యోతిబాపూలే చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పచ్చిపాల సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ వక్తలు మాట్లాడుతూ జనగణనలో ప్రతి కుల జనాభాను కచ్చితంగా లెక్కించి ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు.ప్రధానమైన 4 డిమాండ్లు:1. ఖచ్చితంగా కులగణన ప్రతి కులానికి సంబంధించిన జనాభా వివరాలను పారదర్శకంగా, కచ్చితంగా నమోదు చేయాలి.2. ప్రత్యేక వీతీది కాలమ్ జనగణనలో వీతీదిలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి.3. ప్రత్యేక డ్రాప్ డౌన్ మెనూ ప్రతి కులాన్ని స్పష్టంగా గుర్తించేందుకు జనగణన ప్రక్రియలో ప్రత్యేక డ్రాప్ డౌన్ మెనూ ఏర్పాటు చేయాలి.4. ప్రామాణిక కుల కోడ్ ప్రతి కులానికి ప్రత్యేకమైన, ప్రామాణిక యూనిక్ కోడ్ కేటాయించాలి.

**సమావేశంలో పాల్గొన్న నాయకులు:** బీసీ జేఏసీ సీనియర్ నాయకులు అక్కల బాబుగౌడ్, దాసర్ల వెంకటస్వామి (రిటైర్డ్ హెడ్మాస్టర్), సంజీవ గౌడ్, వ్యాస వెంకటేశ్వర్లు, కానాపురం శ్రీనివాసులు, కాళ్ల నీరంజన్ చీర్ల భాస్కర్, వెంకటయ్య, వంగ అరుణ్ కుమార్ గౌడ్, రామాంజనేయులు గౌడ్, బూరుగుపల్లి కృష్ణ యాదవ్, రంగప్ప యాదవ్, కొమ్ముల ఆంజనేయుడు, బీసీ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ శివ శంకర్ యాదవ్,కో కన్వీనర్ కుంభం మల్లేష్ గౌడ్ అరవింద చారి కరుణాకర్ నాయుడు, బిజినపల్లి మండల బీసీ సంఘం అధ్యక్షులు, వేముల సత్య శీలా సాగర్ (గౌరవ అధ్యక్షులు), రాజేందర్ గౌడ్, చుక్క శివ, వాల్మీకి, అతినరపు బాల లక్ష్మయ్య సాగర్, నక్క పర్వతాలు యాదవ్, దేవరపాగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం...

**మిగులు ఆహారాన్ని పేదలకు పంచి ఆకలి తీర్చుతాం...**

**జాతీయ యువజన అవార్డు గ్రహీత శివ కుమార్..**


మిగిలిన ఆహారాన్ని పంచి పెడుతున్న దృశ్యం

**కల్వకుర్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో మిగులు ఆహార సేకరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బండెల రామచంద్రారెడ్డి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో మిగిలిని ఆహార పథర్థాలను సేకరించి కల్వకుర్తి పట్టణంలో నివసిస్తున్న తిలక్‌నగర్ గుడిసెలోని పెద ప్రజలకు పంపిణీ చేశారు. మిగిలిన ఆహారాన్ని వృధా చేయకుండా పేదలకు పంచిపెట్టడం చాలా గొప్ప కార్యమని అలాగే నిత్యం అనేక రకాల శుభాకార్యల్లో ఆహారాన్ని వృధా చేయకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సేవా బృందం ఆధ్యక్షుడు శివ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అరవింద్ రెడ్డి, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**మదనాపురం,అక్టోబరు 25 ప్రభాతవార్త :** కష్టకాలంలో ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని కొన్నూర్ తండా సర్పంచ్ భర్త లక్ష్మి నారాయణ తెలిపారు. తండాకు చెందిన పీ. రాజు నాయక్ కుమార్తె పవిత్ర ఆదివారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భర్త తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దహన సంస్కార ఖర్చుల నిమిత్తం సర్పంచ్ ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడమే మానవ ధర్మమని, బాధిత కుటుంబానికి గ్రామం ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. పవిత్ర మృతి పట్ల తండా వాసులు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రనాయక్, శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన మల్లోజు మంజుల ఇంటి నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం హైదరాబాదులోని తన వాసంలో రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, నాయకులు బుచ్చిబాబు, గూళ్ల వెంకటేష్, పవన్ తదితరులు ఉన్నారు.

## హైకోర్టు అడ్వకేట్‌కు సన్మానం

**కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. పగిడాల శ్రీనివాస్**

**కొల్లాపూర్,అక్టోబరు 25 ప్రభాతవార్త:** తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన డిఎల్ పాండు ఎన్నికవ్వడం జరిగింది.ఈ సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని ముదిరాజ్ భవనంలో ముఖ్య అతిథిగా హాజరైన డిఎల్ పాండుని శాలువాతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేసి వారు భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకులు డా. పగిడాల శ్రీనివాస్ ఆకాంక్షించారు.మాజీ వైస్ ఎంపీపీ భయ్యా వెంకటస్వామి, ఊరి సుధాకర్, ఉద్యోగ సంఘ నాయకులు ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడి కుటుంబానికి ఫుడ్ కమిషన్ చైర్మన్ పరామర్శ

**వెల్దండ, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కొమ్ము రమేష్ విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పుట్టా రాంరెడ్డి ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఆసుపత్రికి చేరుకొని బాధితుడిని పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10,000 అందజేశారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. తదుపరి వైద్యఖర్చులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ అనిల్‌కుమార్, తిరుమలరావు, శ్రీనివాస్‌రెడ్డితో పాటు తదితర తదితరులు ఉన్నారు.



## ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు

**పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహణ, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో పోటీలు**

**విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి : జిల్లా ఎస్పీ డి.జానకి**



**మహబూబ్‌నగర్ క్రైమ్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా పోలీస్ ఫ్లాగ్ డే - 2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు, అలాగే డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మూడు భాషల్లో నిర్వహించబడతాయని, అభ్యర్థులు తమకు నచ్చిన భాషలో వ్యాసం రాయవచ్చని తెలిపారు. వ్యాసరచన పోటీ అంశాలుకేటగిరీ - 1: 6 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు, క్రింది రెండు అంశాల్లో ఏదో ఒక అంశాన్ని ఎంచుకొని వ్యాసం రాయాలని, కేటగిరీ - 2: డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగిన వారు అర్హులు గా పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే విధానం అభ్యర్థులు తమకు నచ్చిన భాషలో, సూచించిన అంశాల్లో ఏదో ఒక అంశంపై వ్యాసం రాయాలి. వ్యాసం 500 పదాలకు మించకూడదు. వ్యాసాన్ని కాగితంపై రాసి, ఫొటో లేదా పీడీఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ సమయంలో పేరు, విద్యార్హతలు, ఇతర అవసరమైన వివరాలను నమోదు చేయాలి. వ్యాసం సమర్పించడానికి చివరి తేదీ: 27102026. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు సైబర్ నేరాల నివారణ, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనపై చైతన్యం కల్పించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులు ఈ వ్యాసరచన పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

## స్వాములకు అన్నప్రసాద వితరణ ప్రారంభం



**పెబ్బేరు, అక్టోబరు 25 ప్రభాతవార్త :** అయ్యప్ప స్వామి దీక్ష ఆధ్యాత్మికత, నియమ నిష్ఠలు, భక్తిభావానికి ప్రతీకగా నిలుస్తుందని భక్తులు విశ్వసిస్తారు. మాలధారణ చేసిన స్వాములు మండల కాలం పాటు కఠిన నియమాలను పాటిస్తూ, ఏకభుక్తంతో ఉంటూ, నిత్యం స్వామి నామస్మరణ, భజనలు, పూజలు చేస్తూ దీక్షను కొనసాగిస్తారు. ఈ క్రమంలో వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ మిట్ట హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప స్వామి భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేకల ఎల్లయ్య గురుస్వామి, పండితులు గోవర్ధనాచార్యుల సౌజన్యంతో, శ్రీ మిట్ట హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం చేయడం పవిత్రమైన సేవగా భావిస్తారు. ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం, భక్తులకు సేవ చేయడం ద్వారా ఆధ్యాత్మిక తృప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. అన్నదానం కేవలం ఆహారాన్ని అందించడం మాత్రమే కాకుండా, మానవత్వం, దాతృత్వం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి మాలధారణ స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య.. మృతుడి ఆచూకీ గుర్తింపు

**సోషల్ మీడియా ప్రకటనతో కుటుంబ సభ్యులకు సమాచారం**

**అన్న ఫిర్యాదుతో కేసు నమోదు**

**మద్దూరు, అక్టోబరు 25 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపల్ పరిధిలోని దినేష్ రైస్ మిల్ సమీపంలో విద్యుత్ స్తంభానికి ఉరివేసుకుని మృతి చెందిన వ్యక్తి ఆచూకీని పోలీసులు గుర్తించారు. మృతుడు కర్ణాటక రాష్ట్రం గుర్మిట్‌కల్ తాలూకా పుట్‌పాక్ గ్రామానికి చెందిన తన్నె భీమప్ప (34) తండ్రి రాములుగా నిర్ధారించారు. రోడ్డు పక్కన మృతదేహాన్ని గుర్తించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకపోవడంతో పోలీసులు అతడి వివరాలను సేకరించేందుకు ప్రయత్నించారు. అనంతరం సామాజిక మాధ్యమాలు, పత్రికా ప్రకటన ద్వారా వివరాలను వెల్లడించారు. ఈ ప్రకటనను చూసిన సమీప బంధువులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుడిని గుర్తించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భీమప్ప కొన్నేళ్లుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతూ తిరుగుతున్నాడని తెలిపారు. శనివారం ఉదయం మద్దూరు మండలం దంగాన్‌పూర్ గ్రామంలోని తన అత్త దేవేంద్రమ్మ ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరినట్లు పేర్కొన్నారు. అయితే అక్కడికి చేరుకోకుండా మద్దూరు మున్సిపల్ పరిధిలోని దినేష్ రైస్ మిల్ సమీపంలో మృతి చెందాడు. మృతుడి అన్న బోయిని భీమప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## కల్తీ మిర్చి విత్తనాలతో రైతులకు తీవ్ర నష్టం

**మొదటిపేజీ తరువాయి భాగం..**

చెన్న మల్లేష్, వుద్దారపు భాస్కర్, కొరుపాల బాలరాజ్, ఎం.డి. జాం గిర్, చేన్న శ్యాంసుందర్, చేన్న రాములు, గూల వెంకటయ్య చింతకా యల చంద్రయ్య ,గోరంట్ల పెంటయ్య తదితర రైతుల మిర్చి పంటలను పరిశీలించారు. విత్తనాల నాణ్యతపై రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో పంట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పంటల నష్టంతో దాదాపు 10 ఎకరాల్లో మిర్చి సాగు దెబ్బతిన్నట్లు వారు తెలిపారు. రైతులు అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్న సమయంలో విత్తనాల నాణ్యతలో లోపాలు ఉంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అంతటి కాశన్న ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**కంపెనీ యాజమాన్యాలు బాధ్యత వహించాలి...**

మిర్చి విత్తనాల నాణ్యతపై వచ్చిన ఫిర్యాదులపై వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, విత్తనాల నమూనాలను పరీక్షి ంచాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పంట నష్టాన్ని అధికారికంగా అంచనా వేసి, బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. విచారణలో విత్తనాల నాణ్యతలో లోపాలు తేలితే సంబంధిత కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుని, రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ సిపిఎం పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చెన్న శ్యాంసుందర్ ఎన్ని పోతుల కాశన్న చేన్న మల్లేష్ చేన్న రాములు వుద్దారపు భాస్కర్ జాంగిర్, గోరంట్ల పెంటయ్య కొరుపాల బాలరాజు చింతకాయల చంద్రయ్య చింతకాయల గణేష్ గూల వెంకటయ్య చేన్న శ్యాంసుందర్ బండారి వెంకటయ్య బండారు గంగయ్య తదితరులు ఉన్నారు.

## వేద మంత్రాల మధ్య
## వాల్మీకి పాలరాతి విగ్రహ ప్రతిష్ట

**పాన్‌గల్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కేతేపల్లి గ్రామంలో ఐక్య వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి పాలరాతి విగ్రహాన్ని ఆదివారం అట్టహాసంగా ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఐక్య వాల్మీకి పోయే సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు వివిధ పార్టీల నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ రామాయణం రచించిన గొప్ప మేదావి వాల్మీకి మహర్షి అని ఆయనను స్మరించు కున్నారు. ప్రతి ఒక్కరు మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, సింగిల్ విండో చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, కొల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పగిడాల శ్రీనివాస్, సర్పంచ్ భూతగాళ్ళ రమేష్, ఉప సర్పంచ్ కృష్ణవేణి, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు గద్వాల రాములు, రామ్మూర్తి నాయుడు, అశోక్ కుమార్ నాయుడు, ఉమ్మల రాములు, నీల స్వామి, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవి కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము యాదవ్, మధుసూదన్ రెడ్డి, పుల్లారావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, రైతు బంధు మండల మాజీ కో ఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు నాయకులు జ్యోతినందన్ రెడ్డి, అడ్వకేట్ రవి కుమార్, రాజేష్ రెడ్డి, బాలవర్ధన్ రెడ్డి, సిపిఐ నాయకులు శ్రీరామ్, మాజీ సర్పంచులు ఊషన్న, కళావతమ్మ, గ్రామ వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనలో వివిధ పార్టీల నాయకులు

వాల్మీకి బోయ సంఘం నాయకులు

# ఇకపై జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రజావాణి

**ప్రజల నుంచి వినతుల స్వీకరణకు అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు**

**మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి**

**ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రేపు (సోమవారం, అక్టోబర్ 26న) మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతుల స్వీకం ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుంది. జిల్లా స్థాయి కలెక్టరేట్‌లో, డివిజన్ స్థాయిలో సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయాల్లో, మండల స్థాయిలో ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలిమండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలకు చెందిన అధికారులు ఉదయం 10 గంటలకల్లా సంబంధిత ఎంపీడీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీఓ, ఎంఈఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు, సీడీపీఓలు, అంగన్ వాడీ, సంక్షేమ శాఖల అధికారులు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు-భవనాలు, సాగు నీరు, భూగర్భ జల శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి నిర్వహణకు సమన్వయంతో ఏర్పాట్లుఒకటి కంటే ఎక్కువ మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు తమ పరిధిలోని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమం సజావుగా జరిగేలా సంబంధిత ఎంపీడీఓలతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల వినతుల స్వీకరణకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్ని మండలాల్లో ప్రజలకు సౌకర్యవంతంగా వినతులు సమర్పించే అవకాశం కల్పించి, కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను జిల్లా, డివిజన్ లేదా మండల స్థాయిలో తమకు సమీపంలోని సంబంధిత కార్యాలయంలో సమర్పించి ప్రజావాణి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు.

## ఎల్‌నినో ప్రభావం.. అన్నదాతకు అగ్నిపరీక్ష!

**మొదటిపేజీ తరువాయి భాగం..**

పంటలు పండించుకుం టున్నారు. ముఖ్యంగా బోరుబావులు, చెరువులు, కుంటలపై ఆధార పడే రైతులకు భూగర్భజలాల తగ్గి మరింత భారంగా మారవచ్చు.

**పంటలపై ప్రభావం.. పెరిగే పెట్టుబడి భారం...**

ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం, నేలలో తేమ తగ్గడం వల్ల పంటల పెరుగుదల దెబ్బతినవచ్చు. వరి, పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటల్లో పరిస్థితులను బట్టి దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. పశుగ్రాసం కొరత, పశువులకు తాగునీటి సమస్యలు కూడా గ్రామీణ కుటుంబాలపై అదనపు భారాన్ని మోపవచ్చు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు వాతావరణ అనిశ్చితి మరో సవాలుగా మారుతోంది.

**ముందస్తు జాగ్రత్తలే రైతుకు రక్షణ...**

వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి. వర్షపాత అంచనాలను పరిశీ లించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, విత్తనాల విత్తే సమయాన్ని నిర్ణయించుకోవాలి. పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునే పద్ధతులు, చెరువులు-కుంటల సంరక్షణ, పొలాల గట్ల బలోపేతం, నేలలో తేమను కాపాడే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలి. సాధ్యమైన చోట బిందు, తుంపర సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను అనుసరించాలి. పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, తక్కువ నీటితో పండే స్థానికంగా అనుకూలమైన పంటలను ఎంచుకోవడం, పంటల బీమా నిబంధనలను ముందుగానే తెలుసుకోవడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ సలహాలను గ్రామస్థాయిలో రైతులకు చేరవేయడంలో అధికారులు, రైతు వేదికలు, వ్యవసాయ అధికారులు కీలక పాత్ర పోషించాలి.

**ప్రభుత్వం, గ్రామాల భాగస్వామ్యం అవసరం...**

నీటి సంరక్షణను ఒక సామూహిక బాధ్యతగా తీసుకోవాలి. ఉపాధి హామీ పథకం సహా వర్తించే ప్రభుత్వ పథకాల ద్వారా నీటి సంరక్షణ పనులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించడం, భూగర్భజలాల పెంపునకు చర్యలు చేపట్టడం అవసరం. వాతావరణ మార్పులపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన సమయంలో నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు అందుబాటులో ఉండేలా చూడాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

ఎల్‌నినోను పూర్తిగా నివారించడం మన చేతుల్లో లేకపోయినా, దాని వల్ల కలగవచ్చే నష్టాలను తగ్గించుకునే ప్రణాళిక మన చేతుల్లోనే ఉంది. ప్రతి వాన చినుకును ఒడిసిపట్టడం, ప్రతి నీటి వనరును కాపాడుకోవడం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం నేటి అవసరం. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది; గ్రామం బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అందుకే వాతావరణ మార్పులను సవాలుగా స్వీకరించి, నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చినప్పుడే గ్రామీణ వ్యవసాయానికి భరోసా కలుగుతుంది. అదే విధంగా ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించుకునేలా చూసుకోవాలి. దీని ద్వారా తాగునీటి కష్టాలు కొద్దివరకు కాపాడినవాళ్ళం అవుతాం.

## సోషల్ మీడియా పోస్టులతో రాజకీయ రగడ..

**పోలీస్ స్టేషన్లకు చేరుతున్న పంచాయితీలు!**

**కాంగ్రెస్-బీఆర్ఎస్ శ్రేణుల మధ్య పరస్పర ఫిర్యాదులు**

**రాజకీయ విమర్శల నుంచి పోలీసు కేసుల వరకు**



**వనపర్తి, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సోషల్ మీడియా వేదికగా సా గుతున్న రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు కొత్త వివాదాలకు దా రితీస్తున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెం దిన నాయకులు, కార్యకర్తల మధ్య పోస్టులు, కామెంట్లు, వీడియో ల రూపంలో సాగుతున్న మాటల యుద్ధం ఒక్కోసారి పోలీస్ స్టేష న్లకు చేరుతోంది. తమ పార్టీని, నాయకులను కించపరిచేలా పోస్టు లు పెట్టారంటూ ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. దీంతో సోషల్ మీడియా వేదికగా మొదలైన వివాదాలు పోలీసుల దృష్టికి వెళ్లి, రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.

**పోస్టు ఒకరిది.. వివాదం రెండు వర్గాల మధ్య..!**

సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికలను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలు, ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలు, అభి వృద్ధి పనులు, రాజకీయ పరిణామాలపై అనుకూలంగా, వ్యతిరేకం గా పోస్టులు పెడుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో విమర్శలు వ్యక్తిగత ఆరోపణలుగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. ఒక వర్గం పెట్టిన పోస్టుకు మరో వర్గం కౌంటర్ ఇవ్వడం, ఆ పోస్టులపై అనుచరులు ఘాటుగా స్పందించడం, చివర కు పరస్పర ఆరోపణలు, ఫిర్యాదులకు దారితీస్తోంది.

**రాజకీయ విమర్శలకు హద్దులు అవసరం..**

ప్రజాస్వామ్యంలో అధికార పార్టీ విధానాలను ప్రశ్నించడం, ప్రతిప క్షం విమర్శలు చేయడం సహజం. అదే సమయంలో ప్రతిపక్ష విమ ర్శలకు అధికార పక్షం సమాధానం చెప్పడం కూడా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే. అయితే రాజకీయ విమర్శలు వ్యక్తిగత దూషణ లకు, నిరాధార ఆరోపణలకు, కించపరిచే వ్యాఖ్యలకు దారితీస్తే సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అభిప్రాయ భేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిన చోట ఫిర్యాదులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**చట్టపరమైన పరిధిలోనే సోషల్ మీడియా వినియోగం..**

సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు కనిపించగానే దాని వాస్తవాలను నిర్ధారించకుండా షేర్ చేయడం, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించే ఆరోపణలు చేయడం సమస్యల కు కారణం కావచ్చు. అదే సమయంలో ప్రతి రాజకీయ విమర్శను నేరంగా పరిగణించలేమనే విషయాన్ని కూడా గుర్తించాలి. పోస్టులో ని అంశాలు, సందర్భం, అందుబాటులో ఉన్న ఆధారాలు, వర్తించే చట్టాల ఆధారంగానే సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకోవాలి.

**ప్రజలకు ఉపయోగపడే చర్చలపై దృష్టి పెట్టాలి..**

రాజకీయ పార్టీలు సోషల్ మీడియాను ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల ప్రచారం, అభివృద్ధి పనుల వివరాల వెల్లడికి విని యోగిస్తే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. నిరుద్యోగం, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి సమస్యలపై చర్చించాల్సిన వేదికలు వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఫిర్యాదులతో నిండిపోతే అసలు ప్రజా సమస్యలు వెనుకబడే ప్రమాదం ఉంది. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ సంయమనం పాటించడం, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే సమాచారాన్ని పంచుకోవడం, చట్టాన్ని గౌరవిం చడం ప్రతి ఒక్కరి బాధ్యత. సోషల్ మీడియాలో మొదలయ్యే వివా దాలు పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లకుండా రాజకీయ పార్టీలు, వాటి నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పోటీ ఉండాలి.. కానీ అది వ్యక్తిగత వైషమ్యాలకు, అనవసర వివాదాలకు వేదిక కాకూడ దనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

## మన సంస్కృతిని ప్రతిబింబించేదే అలయ్ బలయ్

**మొదటిపేజీ తరువాయి భాగం..**

ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**అయ్యప్ప స్వామి ఆధ్యాత్మికత, క్రమశిక్షణ అందరికీ ఆదర్శం: మారేపల్లి సురేందర్ రెడ్డి...**

అయ్యప్ప స్వామి వారి భక్తి, ఆధ్యాత్మికత, కఠినమైన క్రమశిక్షణ మరియు సేవాభావం సమాజంలోని ప్రతి ఒక్కరిలోనూ నూతన స్ఫూర్తిని నింపుతాయని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి కొనియాడారు. అలాగే, కులమతాలకు అతీతంగా మానవులందరి మధ్య ఐకమత్యం, సోదరభావం పరస్పర గౌరవాన్ని పెంపొందించడంలో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పండుగలు, ఆత్మీయ కలయికలు సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. శబరిమల అయ్యప్ప స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సకల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులను, నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లు రఘు యాదవ్, ప్రశాంత్, పాతూరి రమేష్ బాబు, అనుప ఆంజనేయులు, కిషన్ నాయక్, గోవర్ధన్ గౌడ్, నాయకులు రమేష్ యాదవ్, సతీష్ కుమార్ .జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు రాజు దేశపాండే, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సీమా నరేందర్, నరేందర్ గుప్త, పాలమూరు జిల్లా అధ్యక్షులు భాను ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆరెళ్ళ రమేష్, అన్నధాన కమిటీ ప్రధాన కార్యదర్శి మంత రవి జె. శంకర్, కోశాధికారి రాపర్తి శ్రీను, నగర కమిటీ అధ్యక్షులు నర్సింహారావు , ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్, కోశాధికారి బాల ప్రసాద్ కార్యవర్గ సభ్యులు కొండల్, ఎబిన్ సంతోష్, కుర్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

## మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

**వనపర్తి రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** తండ్రి తరచూ మద్యం సేవించి తల్లితో గొడవ పడుతుండటంతో మనస్తాపానికి గురైన బీటెక్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వనపర్తి మండలం రాజనగరం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నక్క సిద్ధేశ్వర్ (20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి మద్యం సేవించి తరచూ తల్లితో గొడవపడుతుండటంతో మనస్తాపానికి గురైన సిద్ధేశ్వర్ శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి వద్ద చీమలను చంపేందుకు ఉపయోగించే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తల్లి నక్క పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు వనపర్తి రూరల్ ఎస్ఐ హృషీకేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మినీ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

**ధన్వాడ, అక్టోబరు 25 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలోని ఐదో వార్డులో మినీ ట్యాంకు నిర్మాణ పనులకు ఆదివారం గ్రామసర్పంచ్ జ్యోతి రామచంద్రయ్య భూమిపూజ చేశారు. ఈసందర్భంగా నిర్మాణ పనులను ప్రారంభించి, వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మినీ ట్యాంకు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలోని వార్డుల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు గ్రామపంచాయతీ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరసింహులు, ఐదో వార్డు సభ్యురాలు మణెమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పియులో క్రీడా సందడి

**మహిళా క్రీడాకారిణులకు సువర్ణావకాశం**

**పాలమూరు వర్సిటీలో సౌత్ జోన్ సెలక్షన్స్**

**29న క్రాస్ కంట్రీ, 30న మహిళల చెస్ ఎంపికలు**

**మహబూబ్‌నగర్, అక్టోబరు25, ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో మరో క్రీడా సందడి నెలకొననున్నది. ఈ నెల 29న ఉదయం 6:30 గంటలకు స్త్రీ /పురుష క్రాస్ కంట్రీ, 30న ఉదయం 9 గంటలకు మహిళల చెస్ విభాగాల్లో సౌత్ జోన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు తెలిపారు. ఈపోటీలు యూనివర్సిటీ ఇండోర్‌స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 11నుంచి 13వరకు తెలంగాణలోని వాక్సెన్ యూనివర్సిటీ, కర్ణాటకలోని మంగళూరు యూనివర్సిటీల్లో నిర్వహించే సంబంధిత అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు పదో తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ప్రస్తుత విద్యాసంస్థ బోనఫైడ్‌సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. క్రాస్ కంట్రీ క్రీడాకారులు తగిన స్పోర్ట్స్ కిట్‌తో హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొ॥ పి.రమేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని డా. వై. శ్రీనివాసులు వెల్లడించారు.

## కారుబోల్తా నలుగురుకి స్వల్ప గాయాలు..

**పెబ్బేరు, అక్టోబరు25 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి గ్రామ సమీపంలో కారు బోల్తా పడి నలుగురు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా వనపర్తి నుండి పెబ్బేరుకు వెళ్తుండగా కారులో ప్రయాణిస్తున్న అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిలో నలుగురికి స్వల్ప గాయాలు కాగా గర్భిణీకి తీవ్ర గాయాలు అయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మోహన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



మోహన్ యాదవ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** పిఆర్‌టియు టిఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్ యాదవ్‌కు కాలికి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నగరంలోని. ఏనుగొండ లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్‌తో పాటు పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బుచ్చారెడ్డి, వెంకట నర్సయ్య, పిఆర్‌టియు నాయకులు జనార్ధన్, స్వామి, శ్రీనివాస్, ఇజ్రాయెల్, శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున రెడ్డి, పురేందర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమ కారులు నాచ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.